సాక్షి శ్రీకాకుళం

బుధవారం । 18 । అక్టోబర్ । 2023



జగనన్న చేదోడు రేపు

జగనన్న చేదోడు 19వ తేదీన నిర్వహిం చనున్నారు. 15059 మందికి లబ్ధి చేకూరనుంది.

- IIలో



వివాహిత దారుణ హత్య

నరసన్నపేటలో హత్య జరిగింది. వివాహితను గొంతు కోసి చంపేశారు.

- IIలో

నేటి నుంచి వర్సిటీకి సెలవులు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వ విద్యాలయం, అఫిలియేషన్ డిగ్రీ, పీజీ, వృత్తి విద్యా కళాశాలలకు బుధవారం నుంచి ఈ నెల 25వరకు టీచింగ్ సిబ్బందికి, విద్యార్థులకు సెలవులు ప్రకటించినట్లు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సీహెచ్ఏ రాజేంద్రప్రసాద్ తెలిపారు. 26న విద్యాసంస్థలు పునః ప్రారంభంకానున్నాయని అన్నారు. నాన్ టీచింగ్ సిబ్బందికి పబ్లిక్ హాలీడేస్‌లో సెలవులు ఉంటాయని అన్నారు.

న్యూస్‌రీల్

డిగ్రీ నాలుగో సెమిస్టర్ మూల్యాంకనం పూర్తి

ఎచ్చెర్ల క్యాంపస్: డిగ్రీ నాలుగో సెమిస్టర్ జవాబు పత్రాల మూల్యాంకనం పూర్తి చేసినట్లు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం ఎగ్జామినేషన్స్ డీన్ డాక్టర్ ఎస్.ఉదయ్ భాస్కర్ తెలిపారు. వర్సిటీ పరీక్షల కార్యాలయంలో ఆయన మంగళవారం వివరాలు వెల్లడించారు. త్వరలో ఈ ఫలితాలు విడుదల చేస్తామన్నారు. డిగ్రీ రెండో సెమిస్టర్ జవాబు పత్రాల మూల్యాంకనం చివరి దశకు చేరుకుందని తెలిపారు. నవంబర్ మొదటి వారంలో ఫలితాల విడుదలకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో ఆరోగ్య భద్రత



ఆమదాలవలసలో స్టాల్‌ను పరిశీలిస్తున్న జేసీ నవీన్

ఆమదాలవలస: జగనన్న ఆరోగ్య సురక్షతో పేదల ఆరోగ్య భద్రతకు తొలి అడుగు పడిందని శ్రీకాకుళం జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ అన్నారు. స్థానిక మోణంగివారి వీధిలోని డాక్టర్ వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రంలో మంగళవారం నిర్వహించిన ఆరోగ్య సురక్ష క్యాంపు శిబిరాన్ని సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల కనీస, సాధారణ స్థాయి వైద్య అవసరాలను గుర్తించి తక్షణ వైద్య సేవలు అందించేందుకు సురక్ష దోహదపడుతుందని తెలిపారు. తద్వారా ఆరోగ్య సేవల కల్పనలో ప్రజల సంతృప్తి స్థాయిలను పెంచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. పరిశీలనలో భాగంగా సిబ్బంది, వలంటీర్ల పనితీరును అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనరు ఎం.రవిసుధాకర్, తహసీల్దార్ ఎం.గణపతిరావు, ఏఈలు కె.అప్పలనాయుడు, బి.సృజన తదితరులు పాల్గొన్నారు.

'భవన నిర్మాణ పనుల పరిశీలన'

నరసన్నపేట: జిల్లాలో సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వెల్‌నెస్ భవన నిర్మాణాల వాస్తవ పరిస్థితులపై సర్వే చేస్తున్నామని, సర్వేను బుధవారానికి పూర్తి చేయాలని జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి ఆర్.వెంకట్రామన్ అన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నరసన్నపేటలో భవన నిర్మాణ పనుల సర్వేను ఆయన మంగళవారం పరిశీలించారు. ఎంపీడీఓలకు ప్రత్యేక యాప్ ఇచ్చారని, భవన నిర్మాణాల వద్దకు వెళ్లి ఫొటోలు తీసి యాప్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. జిల్లాలో 602 సచివాలయాల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని, వీటిలో 293 పూర్తి చేసి అప్పగించారని అన్నారు. రైతు భరోసా కేంద్రాలు 493 భవనాల పనులకు నిధులు మంజూరు కాగా 203 పూర్తయ్యాయని, 358 వెల్‌నెస్ కేంద్రాలకు నిధులు రాగా 64 పూర్తి చేసి అప్పగించారని తెలిపారు.

బాల్యానికి రక్షణ



బడిలోనో అమ్మ ఒడిలోనే అందంగా గడవాల్సిన బాల్యం మారుమూల ఇటుక బట్టీలు, పట్టణాల్లోని హోటళ్ల నీడన బందబారిపోతోంది. కష్టాలకు దూరంగా ఇష్టాలకు దగ్గరగా పెరగాల్సిన బాలలు వెట్టి చాకిరీ చేస్తూ బానిసల్లా బతుకుతున్నారు. ఖాకీల సాయంతో ఈ బాలల బతుకుల్లో మార్పు వస్తోంది. మానవ అక్రమ రవాణా నిరోధక విభాగం చొరవతో పిల్లలు బడినీడకు చేరుతున్నారు. ప్రభుత్వాధికారుల కృషితో నిస్సహాయులకు ఓ ఆశ్రయం లభిస్తోంది. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనే లక్ష్యంగా వీరు ముందుకు సాగుతున్నారు.

- బాలల సంరక్షణపై ఏహెచ్‌టీయూ ప్రత్యేక కృషి
- ఎస్పీ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు
- నిరంతర రెస్క్యూలతో బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన
- జీరో కేసుల లక్ష్యంతో ముందడుగు

చైల్డ్ హెల్ప్‌లైన్ నంబర్లు

1098
112, 181,
100, 1930

డ్రాపౌట్లను గుర్తిస్తున్నాం



డ్రాపౌట్లను గుర్తించి బడుల్లో చేర్పిస్తున్నాం. 2022లో నలుగురు ఇతర రాష్ట్ర బాలలను వారి తల్లిదండ్రులకు అప్పగించాం. 2023లో ఒడిశా, తెలంగాణ (కరీంనగర్)కు చెందిన ఇద్దరు పిల్లలను అప్పగించాం. అధికారులతో ఈ మధ్యనే న్యాయమూర్తుల సమక్షంలో భవిష్యత్ కార్యాచరణపై సమావేశం పెట్టాం. - జె.తిప్పేస్వామి, జిల్లా స్పెషల్ జువైనల్ యూనిట్ అధికారి, అడిషనల్ ఎస్పీ (అడ్మిన్)

జీరో కేసులే లక్ష్యం



ఎస్పీ ఆదేశాలతో చైల్డ్ లేబర్, బాండెడ్ లేబర్ కేసులు జీరో అవ్వాలనే లక్ష్యంతో జిల్లాలో అన్ని విద్యాసంస్థలు, గ్రామాల్లో తిరిగి అవగాహన కల్పిస్తున్నాం. గతం కంటే భిన్నంగా ఆపరేషన్ ముస్కాన్‌లో భాగంగా నిరంతర రెస్క్యూలతో ఏటికేటా సంఖ్య తగ్గుతూ వస్తుంది.

- సదాశివుని కేశవరావు, ఎస్ఐ, ఏహెచ్‌టీయూ



ఎస్పీ రాధిక సమక్షంలో తల్లి చెంతకు బాలున్ని చేరుస్తూ.. (ఫైల్)



శ్రీకాకుళం రోడ్డు రైల్వే స్టేషన్‌లో బాలలను రెస్క్యూ చేస్తూ.. (ఫైల్)

శ్రీకాకుళం క్రైమ్ : ఇటుక బట్టీల్లో బాల్యాన్ని బందీ చేసుకున్న వారు కొందరు, కాని వయసులో కూలి పనులకు వెళ్తూ బానిసలుగా మారిన వారు ఇంకొందరు, బాధలు భరించలేక బలవన్మరణాలకు పాల్పడిన వారు మరికొందరు.. బాల్యం అందరికీ ఒకే తీరున గడవడం లేదు. తల్లిదండ్రులు లేని, బంధువులు ఆదరించని అభాగ్య బాలలు బాల కార్మికులుగా మారిపోతున్నారు. వీరి బతుకుల్లో ఆనందం నింపేందుకు మానవ అక్రమ రవాణా నిరోధక విభాగం పోలీసులు శతధా కృషి చేస్తున్నారు. ఎస్పీ జీఆర్ రాధిక దిశానిర్దేశంతో నిరంతరం శ్రమిస్తున్నారు.

ఏహెచ్‌టీయూలో ఎవరెవరు..

మానవ అక్రమ రవాణా నిరోధక విభాగం అనేది పోలీసు యంత్రాంగంలో ఓ విభాగం. మన జిల్లాలో అయితే ఇద్దరు ఎస్ఐలు (సదాశివుని కేశవరావు, లండ వెంకటరావు), ఇద్దరు హెచ్‌సీలు, ఇద్దరు పీసీలు ఉండగా వీరికి ఇన్‌చార్జిగా డీసీఆర్బీ సీఐ (దేవరపల్లి నవీన్‌కుమార్) ఉన్నారు. అడిషనల్ ఎస్పీ జె.తిప్పేస్వామి స్పెషల్ జువైనల్ పోలీస్ యూనిట్ అధికారిగా వ్యవహరిస్తున్నారు. ఐసీపీఎస్ (సమగ్ర బాలల సంరక్షణ పథకం), సోషల్ వెల్ఫేర్, విద్య, ఎస్ఎస్ఏ (సర్వశిక్షాఅభియాన్), బీబీఏ (బచపన్ బచావ్ ఆందోళన్), సీడబ్ల్యూసీ (పిల్లల సంక్షేమ కమిటీ), బ్రిడ్జ్, ఎన్జీవో ఆర్గనైజేషన్, వార్డు, గ్రామ సచివాలయ మహిళా పోలీసులు వంటి విభాగాలే కాక కొత్తగా ప్రభుత్వంలోని అన్ని విభాగాలను చేర్చారు.

ఎంత మందిని అప్పగించారంటే..

2019 నుంచి 2023 ఆగస్టు వరకు జరిగిన 1800 రెస్క్యూల్లో 1282 మంది బాలురు, 518 బాలికలను గుర్తించారు. వీరిలో కొందరు బాల కార్మికులు కాగా చాలా మంది ఇంటి నుంచి పారిపోయిన వారు, ఆత్మహత్య ఆలోచనలో ఉన్న వారు, ఆత్మహత్యాయత్నం చేసుకున్న వారు ఉన్నారు. వీరికి సీడబ్ల్యూసీ విభాగం వారితో కౌన్సిలింగ్ ఇప్పించి వారి తల్లిదండ్రులకు అప్పగించారు. మరో 70 మందిని విశాఖపట్నం హోమ్‌కు తరలించారు.

అవగాహన కల్పిస్తారిలా..

2022–2023 ఆగస్టు మధ్య కాలంలో జిల్లాలో ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లోని 23,441 మంది బాలలకు అవగాహన కల్పించారు. వారి హక్కులు , బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన , చైల్డ్ అబ్యూజ్, బాల్యవివాహాలు వలన కలిగే నష్టాలు, అశ్లీల దృశ్యాలు చూసినా, చిత్రించినా, వేరేవారికి పంపినా (చైల్డ్ పోర్నోగ్రఫీ) వచ్చే ఉపద్రవాలు వంటి నేరాలపై 166 అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

అవతార స్వరూపిణి



కంచిలి: శాకంబరీదేవిగా దర్శనమిచ్చిన కంచమ్మతల్లి అమ్మవారు



శ్రీకాకుళం కల్చరల్: చిన్మయామిషన్‌లో ఏర్పాటుచేసిన బొమ్మల కొలువు



నరసన్నపేట: ముర్రాటలతో ఊరేగింపుగా వస్తున్న భవానీలు, మహిళలు

నవరాత్రి వైభవం

సుందరంగా అలంకరణలు, చూడ ముచ్చటగా బొమ్మల కొలువులు, వేడుకగా ముర్రాటల ఊరేగింపులతో దసరా ఉత్సవాలు కమనీయంగా జరుగుతున్నాయి. శరన్నవరాత్రుల సందర్భంగా ఊరికో రీతిలో జాతరలు నిర్వహిస్తున్నారు. తీరొక్క రీతిన తల్లిని కొలుస్తూ తరిస్తున్నారు.



శ్రీకాకుళం కల్చరల్: పుణ్యపువీధిలో బొమ్మల కొలువు



పాతపట్నం: అన్నపూర్ణ దేవిగా నీలమణిదుర్గ అమ్మవారు

ముంబై ప్రదర్శనలో ఖాదీ కార్మికులు



ఖాదీ ప్రదర్శనలో మహిళా కార్మికులు

పొందూరు: ముంబైలోని ఎంఎంఆర్‌డీఏ మైదానంలో నిర్వహిస్తున్న గ్లోబల్ మెరిటైన్ సమ్మిట్‌లో పొందూరు ఖాదీ కార్మికులు పాల్గొన్నారు. ఖాదీ గ్రామోద్యోగ్ కమిషన్ సిఫార్స్ మేరకు ఆరుగురు మహిళా ఖాదీ వడుకు పనివారు ఆయా ప్రక్రియలను నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో ఏఎఫ్‌కేకే సంఘం కార్యదర్శి దండా వెంకటరమణ, సంస్థ ఉద్యోగి, అనువాదకుడు జల్లేపల్లి శంకరరావు పాల్గొన్నారు.

అన్ని కులాలకు సమన్యాయం

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్



మాట్లాడుతున్న ధర్మాన కృష్ణదాస్

జలుమూరు: గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా ఉత్తరాంధ్ర అన్ని విధాలా వెనుకబడిందని, మళ్లీ సీఎం వైఎస్ జగన్ చొరవతో ఉత్తరాంధ్ర త్వరితగతిన అభివృద్ధి చెందుతోందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. ఆయన మంగళవారం శ్రీముఖలింగంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించి విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో అన్ని కులాలకు సమన్యాయం జరుగుతోందని అన్నారు. విశాఖ పరిపాలన రాజధానితోపాటు ఐటీ రంగం అభివృద్ధి చెందేందుకు సీఎం వైఎస్ జగన్ చేస్తున్న కృషి గొప్పదన్నారు. వైఎస్ జగన్ పేదల పక్షపాతిగా పేరొందారని, తెలంగాణ సీఎం కేసీఆర్ కూడా ఇక్కడి పింఛన్ విధానాన్ని ప్రశంసించారని తెలిపారు. జగన్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు సుఖంగా ఉన్నారని పేర్కొన్నారు. మళ్లీ ఆయనే సీఎంగా రావాలని ప్రజలు కోరుతున్నారని చెప్పారు.

మొదటి విడత పీజీ ప్రవేశాలు పూర్తి

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో పోస్టు గ్రాడ్యుయేషన్ మొదటి విడత ప్రవేశాలు పూర్తయ్యాయని వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు చెప్పారు. విశ్వవిద్యాలయంలోని పరిపాలన కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడారు. రాష్ట్రం యూనిట్‌గా నిర్వహించిన పీజీ సెట్–2023 ఆధారంగా ఈ ప్రవేశాలు జరిగాయని అన్నారు. రెండో విడత కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను త్వరలో ఉన్నత విద్యా మండలి విడుదల చేయనుందని పేర్కొన్నారు. ఈ మేరకు తదుపరి ప్రవేశాలు జరుగుతాయని అన్నారు. ప్రభుత్వం జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన పథకాలు పక్కాగా అమలు చేస్తోందని తెలిపారు. మొదటి విడతలో వర్సిటీలో చేరాలనుకున్నా సీటు రాని వారికి రెండో విడత ఆన్‌లైన్ కౌన్సెలింగ్‌లో మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పారు. తుది విడత కౌన్సెలింగ్ అనంతరం మార్గదర్శకాలకు అనుగుణంగా స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తామని అన్నారు.

శాసనమండలి ప్రివిలేజెస్ కమిటీ సభ్యునిగా దువ్వాడ



దువ్వాడ శ్రీనివాస్

టెక్కలి: శాసనమండలి ప్రివిలేజెస్ కమిటీ సభ్యునిగా ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్‌కు స్థానం కల్పిస్తూ ఏపీ శాసనసభ సెక్రటరీ జనరల్ డాక్టర్ పి.పి.కె. రామాచార్యులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు మంగళవారం ఎమ్మెల్సీ కార్యాలయ సిబ్బంది ఆ ఉత్తర్వులను మీడియాకు అందజేశారు. 2023–24 సంవత్సరానికి సంబంధించి ఈ కమిటీలో దువ్వాడ కొనసాగుతారని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

కొత్తమ్మా కరుణించమ్మా



విద్యుత్ అలంకరణలో అమ్మవారి ఆలయం (ఇన్‌సెట్‌లో) కొత్తమ్మ తల్లి

- కోటబొమ్మాళిలో ప్రారంభమైన అమ్మవారి ఉత్సవాలు



కోటబొమ్మాళి: కొత్తమ్మ తల్లి ఉత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆనవాయితీ ప్రకారం కమ్మకట్టు కుటుంబ సభ్యులు వేకువజామున ముర్రాట పోసి ఉత్సవాలను ప్రారంభించారు. అనంతరం నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, టెక్కలి వైఎస్సార్‌సీపీ సమన్వయ కర్త దువ్వాడ వాణి, కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి, కాళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు, ఎంపీ రామ్మోహన్ నాయుడు అమ్మవారిని దర్శించుకున్నారు. ఉత్సవాల్లో తొలి రోజు కోలాటం, కూచిపూడి డ్యాన్సులు, పగటి వేషాలు భక్తులను అలరించాయి. ఊరంతా ఏర్పాటు చేసిన విద్యుత్ అలంకరణలు జిగేల్‌మనిపించాయి. ఆలయ కమిటీ చైర్మన్ బోయిన మాధవి, ఉత్సవాల కమిటీ అధ్యక్షుడు బోయిన నాగేశ్వరరావు, ఈఓ వి.రాధాకృష్ణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.



ఆలయం క్యూలో భక్తులు



కోలాహలంగా కోలాటం

క్లుప్తంగా

99 పోస్టులకు త్వరలో నోటిఫికేషన్

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వ విద్యాలయంలో 99 ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు త్వరలో నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు రిజిస్ట్రార్ సీహెచ్ఏ ఎ.రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. వర్సిటీ పరిపాలన కార్యాలయంలో మంగళవారం వివరాలు వెల్లడించారు. ఉన్నత విద్యాశాఖ, ఉన్నత విద్యామండలి ఆదేశాల మేరకు పాలక మండలి, అకడమిక్ సెనేట్, బోర్డ్ ఆఫ్ స్టడీస్‌ల్లో చర్చించి అనంతరం నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు చెప్పారు. నియామక ప్రక్రియలో రిజర్వేషన్ రోస్టర్ పక్కాగా అమలు ఉంటుందని తెలిపారు. నోటిఫికేషన్ విడుదలకు సంబంధించి కసరత్తు చివరి దశకు చేరిందని వివరించారు.

'కాంగ్రెస్‌కు పూర్వవైభవం తీసుకువస్తాం'

శ్రీకాకుళం అర్బన్: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తామని డీసీసీ అధ్యక్షుడు పేడాడ పరమేశ్వరరావు అన్నారు. శ్రీకాకుళంలోని ఇందిరావిజ్ఞానభవన్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని, జిల్లాలో పార్టీ పూర్వవైభవాన్ని తిరిగి తీసుకొస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇతర పార్టీల్లో ఉన్న కాంగ్రెస్ నేతలను 'మన ఇంటికి రండి' అనే నినాదంతో తిరిగి పార్టీలోకి ఆహ్వానిస్తున్నామని తెలిపారు. తనకు ఈ బాధ్యతలు అప్పగించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

బైక్ ఢీకొని ఇద్దరికి గాయాలు

శ్రీకాకుళం క్రైమ్ : నగరంలోని భాష్యం స్కూలు సమీపంలో బైక్ ఢీకొని ఇద్దరు గాయపడినట్లు ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ వెంకరమణ పేర్కొన్నారు. ట్రాఫిక్ జామ్ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో పనిచేస్తున్న రాజేష్ ప్రసాద్ సాహు మండల వీధిలో నివాసముంటున్నాడు. ఈయన స్వస్థలం పశ్చిమబెంగాల్. సోమవారం రాత్రి భోజనం కోసం మండల వీధి నుంచి నడుచుకుంటూ వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన ద్విచక్ర వాహనం ఢీకొట్టడంతో అతనికి గాయాలయ్యాయి. ద్విచక్ర వాహనదారుడు కూడా కింద పడడంతో అతనికీ దెబ్బలు తగిలాయి. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ తెలిపారు.

'కిట్లు వినియోగించుకోవాలి'



కార్యకర్తల సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న పీడీ శాంతిశ్రీ

సారవకోట: అంగన్‌వాడీ కేంద్రాలకు ఇచ్చిన పూర్వ ప్రాథమిక విద్యా కిట్లను కార్యకర్తలు వినియోగించాలని మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ శాంతి శ్రీ సూచించారు. ఆమె స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం సారవకోట, జలుమూరు మండలాల అంగన్‌వాడీ కార్యకర్తలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్యను అభివృద్ధి చేసేందుకు పీపీ-1, పీపీ-2 కిట్లు అందించామని, వాటిని కట్టలు కట్టి పడేయకుండా కేంద్రాలకు హాజరయ్యే పిల్లలకు పూర్వ ప్రాథమిక విద్యను బోధించాలన్నారు. టీహెచ్‌ఆర్ పిల్లలకు బాలామృతం వినియోగంపై అవగాహన కల్పించాలన్నారు. గర్భిణులు, బాలింతలకు గత కొన్ని నెలల నుంచి ఎఫ్‌ఆర్‌ఎస్ విధానం ద్వారా టీహెచ్‌ఆర్ కిట్లు అందిస్తున్నామని ప్రతి ఒక్క కార్యకర్త వంద శాతం ఎఫ్‌ఆర్‌ఎస్ జరిగేటట్లు చూడాలన్నారు. ఆమెతో పాటు నోడల్ ఆఫీసర్ మణి, సీడీపీఓ హెచ్‌కే కామాక్షి, పలువురు సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

బార్ ప్రతినిధులతో సమావేశం నేడు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలోని ఇచ్ఛాపురం, సోంపేట, టెక్కలి, కోటబొమ్మాళి, నరసన్నపేట, పాతపట్నం, కొత్తూరు, పొందూరు, రాజాం బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులతో బుధవారం శ్రీకాకుళం జిల్లా బార్ అసోసియేషన్ భవనంలో సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్ని సూర్యారావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రతి పిటిషన్‌పై ఒక రూపాయి స్టాంపుతో పాటు అదనంగా మరో రూ.20 వెల్ఫేర్ స్టాంపు అతికించాలని బార్ కౌన్సిల్ వారు ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. ఈ సంక్షేమ నిధి స్టాంప్ రుసుం పెంపును అందరు న్యాయవాదులు వ్యతిరేకిస్తున్నారని పేర్కొన్నారు. ప్రస్తుతం న్యాయవాదులకు చెల్లిస్తున్న సంక్షేమ నిధిని నాలుగు లక్షల నుంచి రూ.20 లక్షలకు పెంచాలని జిల్లాలోని వివిధ బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు డిమాండ్ చేస్తున్నారని వివరించారు. సమావేశంలో జిల్లాలోని వివిధ బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులతో వీటిపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
₹140	₹235	₹ 255

● నిస్సహాయులకు అండ



చిత్రంలో కనిపిస్తున్న వ్యక్తి పేరు పైడి వెంకయ్య. వయసు 67 ఏళ్లు. సరుబుజ్జిలి మండలం చినకాగితాపల్లి పంచాయతీ పరిధిలోని వీరభద్రాపురం గ్రామం. కొన్నేళ్లుగా ఈయన పక్షవాతంతో బాధ పడుతున్నారు. ఆస్పత్రికి వెళ్లి మందులు తీసుకోవడం కష్టమవుతోంది. ఈ నేపథ్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ఊరిలోనే నిర్వహించిన ఆరోగ్య శిబిరానికి వలంటీర్లు ఈయనను తీసుకెళ్లారు. స్పెషలిస్ట్ వైద్యులు ఈసీజీతో పాటు అన్ని రకాలు టెస్టులు చేసి నాణ్యమైన మందులు అందించారు. ఆస్పత్రులు తిరిగే యాతన లేకుండా మందులు ఇవ్వడంతో ఆయన సీఎంకు జన్మంతా రుణపడి ఉంటానని ఆనందంగా చెప్పారు.

\- సరుబుజ్జిలి

జాతీయ హాకీ పోటీలకు తరుణ్ ఎంపిక

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాకు చెందిన హాకీ ఆటగాడు అంపోలు తరుణ్‌కుమార్ మరోసారి జాతీయ పోటీలకు ఎంపికయ్యాడు. ఆంధ్రప్రదేశ్ జూనియర్స్ బాలుర జట్టు తరపున ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. ఈ పోటీలు ఈనెల 17 నుంచి 23 వరకు జరుగుతున్నాయి.

తండ్రి ప్రోత్సాహంతో..

చిన్నప్పటి నుంచి హాకీపై మక్కువ పెంచుకున్న అంపోలు తరుణ్‌కుమార్‌ది వ్యవసాయ కుటుంబం. వీరి స్వస్థలం ఎచ్చెర్ల మండలం చిన్నపూడివలస గ్రామం. తండ్రి అంపోలు బాలకృష్ణ వ్యవసాయం చూసుకుంటునే ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తుండగా, తల్లి వెంకటరత్నం గృహిణి. ప్రస్తుతం తరుణ్‌కుమార్ జెడ్పీ హైస్కూల్ కింతలిలో పదో తరగతి చదువుతున్నాడు. నాటి డీఎస్‌ఏ కోచ్‌గా పనిచేసిన బాలమురళీ వద్ద హాకీలో ఓనమాలు నేర్చుకున్నాడు. ఆ తర్వాత మరో సీనియర్ ఆటగాడు అనిల్ వద్ద, ప్రస్తుతం డీఎస్‌ఏ కోచ్‌గా వ్యవహరిస్తున్న పైడి చంద్రశేఖర్(చందు) వద్ద శిక్షణ పొందుతున్నాడు. ఇతని తమ్ముడు సాయిచంద్ కూడా హాకీ గేమ్‌నే ఎంచుకుని రాణిస్తున్నాడు. తండ్రి ప్రోత్సాహంతోనే వీరు ఆటల్లో రాణిస్తున్నారు.

అనతి కాలంలో..

తరుణ్ హాకీ గేమ్‌లో రైట్ ఆఫ్, రైట్ అవుట్‌లలో రెండింటా దిట్టగా పేరుగాంచాడు. నిరంతరం ఆటలో మెలకువలు నేర్చుకుంటూ అనతి కాలంలో రాష్ట్ర, జాతీయస్థాయికి ఎదిగాడు. యలమంచిలి, అనంతపురం, కాకినాడలో జరిగిన సబ్‌జూనియర్స్ రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రాతినిధ్యం వహించాడు. గూడురులో జరిగిన సౌత్‌జోన్ నేషనల్స్ కోచింగ్ క్యాంప్‌కు ఎంపికయాడు. కోచింగ్ క్యాంప్‌లో అదరగొట్టి జాతీయ పోటీలకు ఎంపికయ్యాడు. తాజాగా ఈ నెల 17 నుంచి చెన్నైలో జరుగుతున్న సబ్-జూనియర్స్ సౌత్‌జోన్ నేషనల్స్‌కు ఎంపికయ్యాడు.



తాను సాధించిన మెమెంటోతో తరుణ్

నేడు, రేపు డిగ్రీ ప్రవేశాలకు 'స్పాట్ అడ్మిషన్లు'

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ (అటానమస్) కళాశాలలో 2023-24 విద్యా సంవత్సరానికిగాను వివిధ యూజీ (డిగ్రీ) కోర్సుల్లో ప్రవేశాలకు గాను మిగిలిపోయిన సీట్ల భర్తీకి ఈ నెల 18, 19 తేదీల్లో స్పాట్ అడ్మిషన్లను నిర్వహిస్తున్నట్టు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సూర్యచంద్రరావు తెలిపారు. మొదటి, రెండు, మూడో కౌన్సెలింగ్ ముగిసిన తర్వాత మిగులు సీట్ల భర్తీ కోసం హాజరయ్యే విద్యార్థులు ప్రాసెసింగ్ ఫీజుగా రూ.400 చెల్లించాల్సి ఉంటుందన్నారు. అలాగే స్పాట్ అడ్మిషన్ ద్వారా ప్రవేశాలు పొందిన విద్యార్థులకు జగనన్న విద్యా దీవెన వర్తించదని.. వారు ఫీజు మొత్తం చెల్లించాల్సి ఉంటుందని స్పష్టంచేశారు. అయితే ఎకనామికల్లీ వీకర్ సెక్షన్ (ఈడబ్ల్యుఎస్) ద్వారా చేరాలనుకునేవారు ఆ సర్టిఫికెట్ తమకు స్పాట్ అడ్మిషన్ సమయంలో పొందుపరచాల్సి ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు 7842610285 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

నీలమణి దుర్గ సన్నిధిలో రీజనల్ జాయింట్ కమిషనర్

పాతపట్నం: నీలమణి దుర్గ అమ్మవారిని దేవదాయ ధర్మాదాయ శాఖ ప్రాంతీయ సంయుక్త కమిషనర్ ఎంవీ సురేష్‌బాబు (రాజమండ్రి) మంగళవారం దర్శించుకున్నారు. దసరా నవరాత్రులు సందర్భంగా అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. అర్చకులు ఆశీర్వాదాలు అందజేశారు. ముందుగా ఆలయ మర్యాదలతో ఆలయంలోకి ఆహ్వానించారు. అనంతరం ఆలయ ఈఓ వాసుదేవరావు అమ్మవారి చిత్రపటాన్ని సురేష్‌బాబుకు బహూకరించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త కృష్ణారావు, గుమస్తా సుదర్శన్, అర్చకులు, ఆలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

జగనన్న చేదోడు రేపు

● ఈ విడతలో 15,059 మందికి లబ్ధి

శ్రీకాకుళం పాతబస్టాండ్: చేతివృత్తుల వారికి ఆసరాగా నిలిచే జగనన్న చేదోడు పథకం నగదు గురువారం అందజేయనున్నారు. రజక, నాయీబ్రాహ్మణ, టైలర్లకు ప్రభుత్వం ఈ పథకం ద్వారా రూ.10వేల ఆర్థిక సాయం అందజేస్తోంది. ఇప్పటికే మూడు పర్యాయాలు విజయవంతంగా పూర్తి చేయగా, ఈ ఏడాది మరోసారి లబ్ధిదారులకు నగదును అందించేందుకు చర్యలు చేపట్టారు. ఈ నెల 19వ తేదీన ఈ జగనన్న చేదోడు పథకం నగదును లబ్ధిదారుల వ్యక్తిగత బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమ చేయనున్నారు.

ఇప్పటి వరకు

- 2020-21 సంవత్సరంలో పథకాన్ని ప్రారంభించారు. తొలిసారిగా తొలి విడతగా జిల్లాలో 13,722 మందికి గాను రూ.13.72 కోట్లను 2020 జూన్ 10 తేదీన అందజేశారు.
- 2021-22 సంవత్సరానికి జిల్లాలో 12,376 మందికి రూ.12.37 కోట్లు.
- 2022-23 సంవత్సరానికి గాను జిల్లాలో 14,460 మందికి రూ.14.46 కోట్లు ఖాతాల్లో జమ చేశారు.
- మూడు పర్యాయాల్లో 40,558 మంది లబ్ధిదారులకు గాను రూ.40.55 కోట్లను ప్రభుత్వం అందజేసింది.



నాల్గో విడతలో..

- రజకులు 6393 మందికి రూ.6.39 కోట్లు
- నాయీ బ్రాహ్మణులు 2710 మందికి రూ. 2.71 కోట్లు
- టైలర్లు 5,956 మందికి రూ.5.95 కోట్లు.
- మొత్తం 15059 మంది లబ్ధిదారులకు గాను రూ.15.05 కోట్లు అందజేయనున్నారు.

జాబితాలు సిద్ధం చేశాం

జగనన్న చేదోడు పథకం లబ్ధిదారుల జాబితాలు సిద్ధం చేయడం పూర్తయ్యిందని బీసీ కార్పొరేషన్ ఈడీ జి.గడ్డెమ్మ తెలిపారు. ఈ విడతలో ఎక్కువ మంది లబ్ధిదారులకు ప్రయోజనం చేకూరుతోందని తెలిపారు. ఈ నెల 19న కలెక్టరేట్‌లో సమావేశ మందిరంలో జిల్లాకు సంబంధించిన నిర్వహించడం జరుగుతుందని ఆమె తెలిపారు.

కలెక్టర్‌కు సమస్యల విన్నపం

శ్రీకాకుళం పాతబస్టాండ్: రెవెన్యూ సర్వీసుల సంఘం ప్రతినిధులు మంగళవారం సాయంత్రం కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్‌ను ఆయన చాంబర్‌లో కలిసి వినతి పత్రం అందజేశారు. జిల్లా భూ సేకరణ యూనిట్‌లు ఎత్తివేయడం సరికాదని, వాటిని పునరుద్ధరించాలని కోరారు. ఇంకా జిల్లాలో భూ సేకరణ చేయాల్సి ఉందని, ఈ పరిస్థితుల్లో ఆ యూనిట్ల అవసరం ఎంతైనా ఉందని వారు కలెక్టర్‌కు తెలిపారు. రెవెన్యూ శాఖలో వివిధ కేడర్లలో ఖాళీగా ఉన్న పోస్టులను పదోన్నతులతో భర్తీ చేయాలని తెలిపారు. గత ఎన్నికల్లో కొన్ని మండలాల్లో ఉన్న పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలని కోరారు. క్రమశిక్షణ సర్వీసుల కేసులు ఉన్నాయని, వాటిని దర్యాప్తు చేసి, పరిష్కరించాలని కోరారు. స్టేషనరీకి నిధులు విడుదల చేయాలన్నారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో రెవెన్యూ సర్వీసుల సంఘం జిల్లా అధ్యక్షుడు కె.శ్రీరాములు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పప్పల వేణుగోపాలరావు, కార్యదర్శి బీవీవీఎస్ రాజు, కోశాధికారి జీఎల్ శ్రీనివాసరావు, యూనియన్ ప్రతినిధులు కె.శ్రీనివాసరావు, డి.సోనీకిరణ్, కె.ప్రవల్లికా ప్రియ, డి.శ్రీనివాసరావు, బి.శ్రీనివాసరావు సంతోష్ ఉన్నారు.

ఉపాధ్యాయుడి సస్పెన్షన్

ఇచ్ఛాపురం: మున్సిపాలిటీ పరిధి లాలాపేట మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో ఎస్జీటీగా విధులు నిర్వహిస్తున్న వల్లిశెట్టి రాజేష్‌ని జిల్లా విద్యాశాఖాధికారి కె.వెంకటేశ్వరరావు సస్పెండ్ చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీచేసినట్లు ఎంఈఓ కె.అప్పారావు తెలిపారు. పెళ్లి పేరుతో సహ ఉపాధ్యాయురాలిని మోసగించినట్లు గత నెల 20న వజ్రపుకొత్తూరు పోలీస్‌స్టేషన్‌లో బాధితురాలు ఫిర్యాదు చేయగా పోలీసులు అరెస్టు చేశారని తెలిపారు. ఈ కేసులో విచారణ చేపట్టి ఉపాధ్యాయుడిని విధుల నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారని తెలియజేశారు.

స్వయం ఉపాధితో ఆర్థిక స్వావలంబన

ఆమదాలవలస: స్వయం ఉపాధితో మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలని జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి సుధ సూచించారు. ఆమదాలవలస పట్టణంలోని ధర్మారావు క్వార్టర్స్‌లో అరుణోదయ స్వచ్ఛంద సేవా సంస్థ వారి ఆధ్వర్యంలో ఎంవీ ఆర్ గ్రూప్ ఆఫ్ స్మాల్ స్కేల్ యూనిట్స్ విశాఖపట్నం, ముల్లేటి వెంకటరావు వారి సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఉచిత శిక్షణ-ఉపాధి కల్పన వృత్తిబడి కార్యక్రమాన్ని ఆమె మంగళవారం ప్రారంభించారు. మహిళలు కుటుంబాన్ని ఎలా జాగ్రత్తగా నడిపిస్తారో అంతే శ్రద్ధతో చేతి వృత్తులు నేర్చుకోవాలని పిలుపునిచ్చారు. అరుణోదయ లాంటి స్వచ్ఛంద సంస్థలు ఇలా ముందుకువచ్చి యువతకు శిక్షణలు అందిస్తే బాగుంటుందని అభిప్రాయపడ్డారు. టైలరింగ్, మగ్గం క్యాండిల్స్, తయారీ ఫినాయిల్, సర్ఫ్ తయారీ, మష్రూమ్స్ తయారీ, అప్పడాల తయారీ, వైరు బ్యాగులు అల్లడం తదితర అంశాలపై శిక్షణ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలోఅరుణోదయ సంస్థ వ్యవస్థాపకులు అరుణ్‌కుమార్, శ్రీనివాస రావు, ఎన్జీవో డైరెక్టర్ రవి, నెహ్రూ యువ కేంద్రం వలంటీర్లు లక్ష్మీనారాయణ, కేసరి అప్పలరాజు, గౌతమ్ పట్టణ తదితరులు పాల్గొన్నారు.



శిక్షణ ప్రారంభించి మాట్లాడుతున్న జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి సుధ

వివాహిత దారుణ హత్య



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ జీఆర్ రాధిక



స్థానికుల నుంచి వివరాలు సేకరిస్తున్న పోలీసులు



మృతురాలు శ్రీదేవి (ఫైల్)

నరసన్నపేట:

ఉర్లాం ఉలిక్కిపడింది. గ్రామానికి చెందిన గొర్లె శ్రీదేవి(30) మృతితో గ్రామంలో కలకలం రేగింది. రాత్రి పిల్లలతో పాటు గదిలో నిద్రించిన ఆమె తెల్లారి చూసేసరికి విగతజీవిగా కనిపించింది. ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు కర్కశంగా గొంతు కోసి చంపేశారు. కుటుంబ సభ్యులు అందుబాటులో లేకపోవడంతో ఏం జరిగిందనేది బయటకు రాలేదు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. స్థానికంగా నివాసం ఉంటున్న గొర్లె శ్రీదేవికి ఊరిలో చాలా మంచి పేరు ఉంది. ఆమె భర్త త్రినాథరావు విశాఖ సీఎంఆర్‌లో సెక్యూరిటీ గార్డ్‌గా పనిచేస్తున్నారు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. అత్తమామలతో పాటు ఈమె ఉర్లాంలో ఉంటున్నారు. అయితే శ్రీదేవి అత్తమామలు సోమవారం తిరుపతి వెళ్లారు. దీంతో శ్రీదేవికి తోడుగా ఉండేందుకు ఆమె ఆడపడుచు వరలక్ష్మి ఇక్కడకు వచ్చారు. ఎప్పటిలాగానే సోమవారం రాత్రి మేడపైన ఉన్న గదిలో ఇద్దరు పిల్లలతో పాటు శ్రీదేవి నిద్రించారు. మంగళవారం ఉదయం వరలక్ష్మి ఆ గదికి వెళ్లి శ్రీదేవిని లేపేందుకు ప్రయత్నించారు. ఆమె లేవకపోవడంతో దగ్గరకు వెళ్లి పరిశీలించగా గొంతు కోసుకుపోయి రక్తపు మడుగులో కనిపించారు. దీంతో వరలక్ష్మి నిశ్చేష్టురాలైపోయారు. అమ్మ పక్కనే ఇద్దరు పిల్లలు నిద్రిస్తూ ఉండడం గమనార్హం. ఈ దృశ్యాన్ని చూసిన వెంటనే వరలక్ష్మి చుట్టుపక్కల వారికి, మృతురాలి కుటుంబ సభ్యులకు కూడా సమాచారం అందజేయడంతో.. ఉదయం 11 గంటల సమయంలో శ్రీదేవి మేనమామ మల్లేశ్వరరావు, తల్లి సరస్వతమ్మలు వచ్చి మృతదేహాన్ని చూసి గుండెలవిసేలా రోదించారు. మల్లేశ్వరరావు 100కు ఫోన్ చేసి విషయం చెప్పారు. వెంటనే స్పందించిన నరసన్నపేట ఎస్ఐ వై.సింహాచలం, సీఐ బి.ప్రసాదరావులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి క్లూస్ టీంకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి మృత దేహాన్ని చూసిన తర్వాత శ్రీదేవిది హత్య అని నిర్ధారణకు వచ్చి ఆ దిశగా కేసు దర్యాప్తు ప్రారంభించారు. ఎస్పీ జీఆర్ రాధికతో పాటు టెక్కలి డీఎస్పీ బాలచంద్రారెడ్డి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. చుట్టుపక్కల వారితో మాట్లాడి ఆరా తీశారు. పిల్లలతో కూడా మాట్లాడారు. హత్య జరిగిన ముందు లైంగిక దాడి జరిగి ఉంటుందా అన్న కోణంలో విచారిస్తున్నారు. అలాగే మృతురాలి సెల్‌ఫోన్ దొరకడంతో కాల్ డేటా విశ్లేషిస్తున్నారు. మృతురాలి తల్లి సరస్వతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు ప్రారంభించామని సీఐ ప్రసాదరావు తెలిపారు.

ప్రతి ఇంటికీ తాగునీరు.. ప్రతి సెంటుకు సాగునీరు

● స్పీకర్ తమ్మినేని సీతారాం

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): తన నియోజకవర్గంలో ప్రతి ఇంటికీ తాగునీరు.. ప్రతి సెంటుకు సాగునీరు అందించడమే తన లక్ష్యమని ఏపీ శాసనసభాపతి తమ్మినేని సీతారాం అన్నారు. జిల్లాలో ప్రవహిస్తున్న రెండు ముఖ్య నదుల మధ్య ఉన్న ఆమదాలవలస నియోజకవర్గంలో ప్రతి ఎకరానికి తాగునీరు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. శ్రీకాకుళంలో ఆర్ అండ్‌బీ అతిథి గృహంలో ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడారు. నియోజకవర్గంలోని 13 గ్రామాల్లో లిఫ్ట్ ఇరిగేషన్ పథకాల నిర్మాణాలకు ప్రతిపాదించామని, ఆరు పథకాలు త్వరలో మంజూరవుతాయని తెలిపారు. ఇప్పటికే పొందూరు మండలంలో లైదాం, తండ్యాం గ్రామాల్లో లిఫ్ట్ ఇరిగేషన్ పనులు పూర్తి కావస్తున్నాయని తెలిపారు. నారాయణపురం వంశధార కుడి, ఎడమ కాలువల నీటిని ఎత్తిపోయడం ద్వారా వెన్నెలవలస, అన్నంపేట, అయ్యవారిపేట, కురగాం, పెద్దపేట, తిమ్మాపురం, మదనాపురం ప్రాంతాలకు సాగునీరు అందుతుందన్నారు. ఇప్పటికే జలజీవన్ మిషన్ పనుల్లో భాగంగా నియోజకవర్గానికి రూ 157 కోట్లు నిధులు మంజూరైనట్లు తెలిపారు. పొందూరు, ఎరుకుల పేట, తండ్యాం, రాపాక, కృష్ణా పురం, రెడ్డి పేట, లోలు గు, భగవాన్‌దాస్‌పేట, బురిడి కంచరాం, కేశవదాసుపు రం, నందివాడ తదితర గ్రామాల ప్రజలకు శుద్ధమైన తాగునీరు అందించేందుకు ప్రభుత్వం రూ.50 కోట్లు అందించేందుకు అంగీకరించినట్లు పేర్కొన్నారు. చిలకపాలెంలోని ఓ పరిశ్రమ వల్ల పొందూరులో భూగర్భ జలాలు కలుషితమవుతున్న విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లానన్నారు. నాగావళి ప్రవాహ తీరంలో గల గండ్రేడు గ్రామం నుంచి బెలమాం, తాడివలస, కొంచాడ మీదుగా రాపాక గ్రా మం వద్ద నాగావళి నీటిని పంపింగ్ చేయటం ద్వారా సమస్యకు పరిష్కారం లభిస్తుందని చెప్పారు. ఆమదాలవలసలో ఇండోర్ స్టేడియం నిర్మాణానికి రూ.7కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు కూడా వచ్చాయన్నారు. ఇక్కడ వాలీబాల్, షటిల్, బాల్ బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్‌తో పాటు మరిన్ని క్రీడలు ఆడుతారని చెప్పారు. నీలంశెట్టి అప్పన్న వంటి కోచ్ ద్వారా వందలాది క్రీడాకారులు తయారయ్యారని తెలిపారు. ఈ సందర్భంగా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో సమీక్ష నిర్వహించి మాట్లాడారు. ఆమదాలవలస నియోజకవర్గంలో ప్రతి గ్రామంలోనూ స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ పథకంలో పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. నీటి నిల్వల కోసం వాటర్ ట్యాంకుల నిర్మాణానికి అవసరమయ్యే ప్రభుత్వ స్థలాలను అధికారులు గుర్తించాలన్నారు. నియోజకవర్గంలో 182 వాటర్ ట్యాంకుల నిర్మాణానికి అనుమతులు మంజూరైనట్లు వివరించారు.



మీడియా సమావేశంలో జలజీవన్ మిషన్ మ్యాప్ చూపిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

వలస బతుకుల్లో చీకటి

● బెంగళూరులో జిల్లా వాసులు మృతి

మందస: పొట్ట చేతపట్టుకుని పట్టణానికి వలస వెళ్లిన వారి బతుకులు అక్కడే తెల్లారిపోయాయి. కుటుంబాలను పోషించాలని అంతదూరం వెళ్లిన వారు కుటుంబ సభ్యులకు శోకం మిగుల్చుతూ అనంతలోకాలకు వెళ్లిపోయారు. బెంగళూరులో జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలానికి చెందిన ఇద్దరు మృతి చెందారు. వివరాల్లోకి వెళితే..

మండలంలోని భేతాళపురం గ్రామానికి చెందిన బైపల్లి లోకనాథంతో పాటు సరిహద్దు గ్రామమైన సుమ్మాదేవికి చెందిన ఎస్.భుజంగరావు ఉపాధి కోసం బెంగళూరు వలస వెళ్లారు. ఉన్నచోట ఉపాధి లేకపోవడంతో టింబర్ డిపో(కర్రలమిల్లు)లో కార్మికులుగా పని చేస్తున్నారు. దసరాకు బోనస్ అందుకుని స్వగ్రామాలకు రావడానికి సన్నాహాలు కూడా చేసుకున్నారు. సోమవారం సాయంత్రం ఓ వాహనంలో కర్రల లోడును మిల్లుకు తీసుకువస్తుండగా వాహనం బోల్తా పడింది. దీంతో భుజంగరావు(29) అక్కడికక్కడే ఊపిరి వదిలేశాడు. లోకనాథం(46) తీవ్రంగా గాయపడడంతో బెంగళూరులోని ఓ ఆస్పత్రిలో చేర్పించారు. కానీ ఆయన అక్కడ చికిత్స తీసుకుంటూ కన్నుమూశారు. ఒకే ప్రాంతానికి చెందిన వీరిద్దరూ బెంగళూరులోని అద్దెకు ఉంటూ, ఒకే మిల్లులో పని చేస్తున్నారు. ఈ ప్రమాదంలో ఇద్దరూ మరణించగా, ఆయా కుటుంబాలు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నాయి.



బైపల్లి లోకనాథం(ఫైల్)



ఎస్.భుజంగరావు(ఫైల్)

పెళ్లి నిశ్చయం

లోకనాథానికి భార్య ఆదిలక్ష్మి, కుమార్తెలు షర్మిల, సరయు ఉన్నారు. భుజంగరావుకు ఇదే మండలంలోని భేతాళపురం గ్రామానికి చెందిన యువతితో వివాహం నిశ్చయమైంది. రానున్న ఫిబ్రవరిలో పెళ్లికి ముహూర్తాలు కూడా తీశారు. మరో మూడు నెలల్లో వివాహం జరుగనుండగా భుజంగరావు మృతితో రెండు కుటుంబాల్లో కూడా విషాదం నెలకొంది. లోకనాథం మృతితో ఆ కుటుంబం అనాథగా మారింది. మరణించిన లోకనాథం, భుజంగరావు మృతదేహాలకు బెంగళూరులోని ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. బుధవారం మృతదేహాలు భేతాళపురం, సుమ్మాదేవి చేరుకుంటాయని కుటుంబసభ్యులు చెబుతున్నారు.

సాధారణ చార్జీలతోనే దసరా బస్సులు

శ్రీకాకుళం అర్బన్: దసరా సందర్భంగా సాధారణ చార్జీలతోనే ప్రత్యేక బస్ సర్వీసులు నడుపుతున్నట్లు విజయనగరం జోన్-1 ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చింతా రవికుమార్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. పండగని ప్రయాణికులపై ఎలాంటి అదనపు చార్జీలు వేయడంలేదని స్పష్టం చేశారు. విజయనగరం జోన్ నుంచి హైదరాబాద్‌కు షెడ్యూల్ బస్సులు 5, ప్రత్యేక బస్సులు 32 నడుపుతున్నామని చెప్పారు. అలాగే విజయవాడకు షెడ్యూల్ బస్సులు 26, ప్రత్యేక బస్సులు 110 నడుపుతున్నామని తెలిపారు.

ముందస్తు రిజర్వేషన్‌కు 10 శాతం రాయితీ..

రాను పోనుకై ముందస్తుగా రిజర్వేషన్ చేసుకున్న ప్రయాణికులకు ప్రయాణపు చార్జీలో 10 శాతం రాయితీ కల్పించినట్టు పేర్కొన్నా రు. అన్ని బస్సు స్టేషన్‌లలో ప్రయాణికుల రద్దీకి సరిపడే బస్సులు నడిపేందుకు అధికారులు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండే విధంగా డ్యూటీలు వేసినట్లు పేర్కొన్నారు. అధిక టికెట్ల ప్రైవేట్ బస్సులను ఎవరూ ఆశ్రయించాల్సిన అవసరం లేదని ఈడీ పేర్కొన్నారు. భవానీ భక్తులు తమ దర్శనాలకు ఆర్టీసీ బస్సులను బుక్ చేసుకోవచ్చని తెలిపారు.



బీజేపీ జిల్లా కమిటీ నియామకం

శ్రీకాకుళం న్యూకాలనీ: భారతీయ జనతా పార్టీ జిల్లా కమిటీతోపాటు జిల్లా మోర్చాలకు అధ్యక్షుల నియామకం జరిగింది. ఈ మేరకు జిల్లా బీజేపీ అధ్యక్షుడు బి.ఉమామహేశ్వరరావు మంగళవారం రాత్రి నియామక ఉత్తర్వులు వెలువరించారు. 15 మందితో కూడిన జిల్లా కమిటీతోపాటు యువ మోర్చా జిల్లా అధ్యక్షునిగా బూరె నరేంద్ర చక్రవర్తి, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షునిగా మంగి లక్ష్మిరెడ్డి, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షునిగా గొలివి కరుణాకర్, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షునిగా సీపాన కృష్ణమూర్తి, ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షునిగా జన్ని పరమేష్, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షునిగా బలగ సింహాద్రి నియామకం అయ్యారు.